2. [1]మదావళముఁ బోలు నామదిన్ - దన - [2]ప్రదీప్త వా[3]క్యాం కూశా హతిన్ = యధేచ్ఛలన్నిటి గుదించి పాపపు - మొదల్ తుదల్ నరి - కి దరికిఁ జేర్చెను ॥యెహోవా॥

3. అనీతి వస్త్ర [4]మెడలించెను - యే - సునాధు రక్తమున ముంచెను = [5]వినూత్న యత్నమె - ద నూని యెన్నఁడు - గనన్ వినన్ ప్రే - మ నాకుఁ జూపెను ॥యెహోవా॥

4. విలాపములకుఁ జెవి నిచ్చెను - శ్రమ - కలాపములకు సెలవిచ్చెను = శిలానగము పై - కిలాగి నను సుఖ - కళావళుల్ మన - సులోన నిలిపెను ॥యెహోవా॥

5. అగణ్య పాపియని త్రోయక - న - న్ను గూర్చి తన సుతుని దాఁ చక = తెగించి మృతి కొ - ప్పగించి పాపపు - నెగుల్ దిగుల్ సొగ - సుగా నణంచెను ॥యెహోవా॥

- పురుషోత్తము చౌధరి

## 17 దైవారాధన

రా - నాదనామక్రియ | తా - అట

యెహోవా భజన చేయండి - పాప - నరులారా యీ రీతి మరచి పోకండి ॥యెహోవా॥

1. యేసు పేరిట ప్రార్థనంబు - మన దోసములను బోగొట్టను వెరవు = భాసుర పరలోక సుఖము - కోటి - బాధలు - మనకున్న -సంతోషకరము ॥ యెహోవా॥

2. యేసు క్రీస్తును గొలువండి - యేసు - దాసులతో వాదము లాడ కండి = మోసపు దారి విడువండి - దోష - రాసుల నుర్విలోఁ - జేసికొన కండి ॥యెహోవా॥

3. జీవ రక్షకుని నమ్మండి - నిత్య - సేవలో మెలఁగక చెడిపోవకండి = భావించి యాత్మన్ వేఁడండి - దేవ - దేవుని నెడఁబాసి తెరవు విడకండి ॥ యెహోవా॥

[1]మదించిన యేనుగు. [2]ప్రకాశమైన. [3]అంకుశపు దెబ్బ చేత. [4]పోగొట్టెను. [5]క్రొత్త.



4. మాయ లోకపు భ్రాంతు ల్విడిచి - మను - ష్యాయువు భువిలోన జెల్లుటఁ దలఁచి = మాయ మార్గము లెల్ల మరచి - మోక్ష - మార్గము మన మున - మరవక తలఁచి ॥యెహోవా॥

5. కాయము నొసఁగిన ప్రభుని - యయిదు - గాయంబు లాత్మలోఁ గానంగ రాదా = ఆయు వస్థిర మని తెలిసి - మీరు - కాయ మాత్మయు నిపుడు - కర్తకు నిచ్చి ॥యెహోవా॥

- యేసుదాసు నర్సయ్య

## 18 క్రైస్తవారాధన

రా - సురటి | తా - త్రిపుట

కూడికొని యున్నాము - సంఘ ప్రభో - కూడికొని యున్నాము = తోడ నుండెద ననుచు నమ్ముచు - దొడ్డ దగు నీ పాద సన్నిధి ॥కూడి కొని॥

1. ఎచట నా ప్రియ భక్తు - లెలమిఁ గూడియున్న నచటికి నేతెంతు - నని పల్కితి = విచట నుండు మమ్ము - వీక్షించి కృపచేత - నిపుడు దీవించు మీ - యేసు క్రీస్తునాథా ॥కూడికొని॥

2. గత కాలమందున - గాని చేఁతలచే దు - ర్గతి నొంది యుండఁగాఁ - గనుఁగొంటివి = శత సంఖ్య గల పాప - చయ మీవు క్షమియించి - యతి శాంతి నిడితివి - యాత్మస్వరూపా ॥కూడికొని॥

3. నిరతము నీ ప్రేమ - నెనరున ధ్యానించి -పరమ ధర్మములందుఁ - బరతఁ గల్గి = యరులకు శుభములు - నిరతంబుఁ జేయఁగఁ - దిరత మా కొసఁగు ము - దేవుని ప్రియ తనయా ॥కూడికొని॥

4. అన్ని శోధనముల - నన్ని విపత్తుల - నన్ని కాలములందు - నాదరించి నిన్ను నమ్మిన జనుల - నీ సందిటను జేర్చి - పన్నుగఁ గాపాడు - ప్రభు యేసు క్రీస్తు ॥కూడికొని॥

5. అమలుఁడ నగు న - న్ను నుకరించుం డనుచు - నాన తిచ్చినాఁడ-వాత్మ జులకు = నమల మార్గము నందు - నరుగంగ మాకీవు - విమలాత్మ దయ సేయు - వేగంబు మా తండ్రీ ॥కూడికొని॥

- పులిపాక జగన్నాథము